ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 18 జూన్ 2024

అన్నదాతకు అన్యాయం..!



రొద్దం మండలం చిన్నగువ్వలపల్లిలో రబీలో ఎండిపోయిన పప్పుశనగ పైరు (ఫైల్)

రబీలో జిల్లా అంతటా దుర్భిక్షం..!

వాస్తవ పరిస్థితులను దాచిన వైసీపీ ప్రభుత్వం

పప్పుశనగ పంటకు మాత్రమే నష్టమంటూ నివేదిక

రొద్దం ఒక్కటే కరువు మండలమట..!

31 మండలాలకు మొండిచేయి

రేపు కేంద్ర కరువు బృందం రాక

రబీ ముగిశాక పంట నష్టం పరిశీలనపై విమర్శలు

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వం కరువు రైతుకు తీవ్ర అన్యాయం చేసింది. గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడింది. వాన జాడలేక పంటలు నిట్టనిలువునా ఎండిపోయాయి. పశుగ్రాసం కూడా దక్కలేదు. ఆ ప్రభావం రబీపై కూడా పడింది. మండే ఎండలతో భూగర్భ జలమట్టం పడిపోయింది. బోరుబావులు ఉన్నఫలంగా ఎండిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడిన అవస్థలు అన్నీ.. ఇన్నీ కావు. కొంతమంది రైతులు చేసేదిలేక పంటలను వదిలేసుకుని, సర్వం నష్టపోయారు. ఖరీఫ్, రబీ నష్టాలతో కోలుకోలేని స్థితిలో ఉన్న అన్నదాతను ఆదుకోవాల్సిన అప్పటి వైసీపీ ప్రభుత్వం అన్యాయమే చేసింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే ముందు హడావుడిగా కరువు ప్రాంతాల జాబితాను ప్రకటించింది. అందులో జిల్లాలో వేరుశనగ పంటకు మాత్రమే నష్టం వాటిల్లిందని పేర్కొంది. రొద్దం మండలాన్ని మాత్రమే తీవ్ర కరువు మండలంగా ప్రకటించి, మిగతా 31 మండలాల రైతులకు అన్యాయం చేశారు. ఈ నేపథ్యంలో రబీ పంట నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఈనెల 19న జిల్లాకు రానుంది. రబీ పంట ముగిసి రెండు నెలలైందనీ, ఎప్పుడు ఏం పరిశీలిస్తారని అన్నదాతలు వాపోతున్నారు. కేంద్ర కరువు బృందం పర్యటనతోనైనా న్యాయం చేకూరుతుందా అని రైతులు ఆశగా చూస్తున్నారు.

రైతు ప్రభుత్వమంటే ఇదేనా..?

వ్యవసాయమే జిల్లా ప్రజలకు ప్రధాన జీవనాధారం. గత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. రబీలో కూడా ఈశాన్య రుతుపవనాలు బలహీన పడడంతో వాన జాడ కరువైంది. దీంతో భూగర్భ జలమట్టం పడిపోయి, పంటలు ఎండిపోయి రైతన్నలకు అప్పులే మిగిలాయి. 2023-24లో రబీ సీజన్‌లో జిల్లా అతంటా కరువుఛాయలు అలుముకున్నా వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టి ఒక్క మండలాన్నే కరువు జాబితాలో చేర్చారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకనే వైసీపీ ప్రభుత్వం ప్రకటించి, చేతులు దులుపుకుంది. వైసీపీ ప్రభుత్వం హడావుడి తప్పులకు రబీలో సాగులో ఒక్క మండలమే నష్టపోయిందంటూ ప్రకటనతో రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. గతేడాది ఖరీఫ్‌లో ఏడు తీవ్ర, 14 మధ్యస్థ కరువు మండలాలను ప్రకటించి, 11 మండలాలకు మొండిచేయి చూపారు. రబీలో రొద్దం మండలాన్ని మాత్రమే కరువు జాబితాలో చేర్చారు. తామేం పాపం చేశామంటూ మిగిలిన 31 మండలాల రైతులు వాపోతున్నారు. పంట సాగు విస్తీర్ణం, దిగుబడి, వర్షపాతం నమోదు భూమిలో తేమ శాతం భూగర్భజలమట్టం తదితర అంశాలపై కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు మండలాలను ఎంపిక చేస్తారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకున్న వైసీపీ పాలకులు.. వారికే అన్యాయం చేశారు. అప్పట్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో వైసీపీ జిల్లా ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువె త్తాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి రబీలో పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లా యంత్రాంగం మాత్రం క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలించకుండానే గత ప్రభుత్వం చెప్పినట్లు కంటితుడుపుగా నివేదికలు సిద్ధం చేసి, పంపింది. కరువు ప్రాంతాల జాబితాలో చోటు లభిస్తే ఆయా మండలాల్లో పంట రుణాల రీషెడ్యూల్, పంటనష్ట పరిహారం, తాగునీటికి నిధులు, ఉపాధి కల్పన తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు రబీ ముగిసింది. అప్పట్లో జిల్లావ్యాప్తంగా ఎండిపోయిన పంట పొలాలు కనిపించేవి. రబీ సీజన్ ముగిసి రెండు నెలలు దాటింది. మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై జిల్లా అంతటా వర్షం కురుస్తోంది. ఇప్పుడు కేంద్ర కరువు బృందం పర్యటన ఏమేరకు ప్రయోజనం చేకూరుస్తోందనన్న ఆందోళన నెలకొంది.

పప్పుశనగ ఒక్కటేనట..!

జిల్లాలోని 32 మండలాల్లో ప్రధానంగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. నీటి వనరులున్న రైతులు రబీలో పప్పుశనగ, వరి, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలు 28192 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో పప్పుశనగ పంటను రొద్దం, పరిగి, తాడిమర్రి, పెనుకొండ మండలాల్లో సాగు చేశారు. రొద్దం మండలంలోనే అధికంగా 876 హెక్టార్లలో పంట వేశారు. ఈనేపథ్యంలోనే మార్చిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం రొద్దం మండలాన్ని మాత్రమే కరువు ప్రాంతంగా ప్రకటించింది. రబీలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలమట్టం తగ్గి, పంటలు ఎండిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. రొద్దం మండలంలో మాత్రమే పప్పుశనగ పంటకు నష్టం వాటిల్లినట్లు యంత్రాగం.. ప్రభుత్వానికి హడావుడిగా ప్రతిపాదనలు పంపింది. రొద్దం మండలంలో 503 మంది రైతులు 656.92 హెక్టార్లలో పప్పుశనగ పంట సాగు చేసి, నష్టపోయారు. రూ.65.60 లక్షలు పరిహారం అందించాలని అప్పట్లో అధికారులు.. ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

పంటే లేదు.. ఏం పరిశీలిస్తారు..?

రబీ సీజన్ ముగిసి రెండు నెలలు దాటింది. కేంద్ర కరువు బృందం ఇప్పుడు రబీ పంట నష్టాన్ని పరిశీలించేందుకు వస్తోంది. బుధవారం జిల్లాకు రానున్నట్లు యంత్రాంగం చెబుతోంది. పంటలే లేనపుడు ఏం పరిశీలిస్తారన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లా అంతటా పంటలు ఎండిపోయాయి. కనీసం పశుగ్రాసం కూడా దక్కలేదు. గతేడాది డిసెంబరులో పర్యటించిన కేంద్ర కురువు బృందం కేవలం 73,566 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ, మొక్కజొన్న పంటలు నష్టపోయినట్లు నివేదిక ఇచ్చింది. ఆ మేరకే కంటితుడుపుగా పరిహారం ఇచ్చారు. జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. రబీ పంట నష్ట పరిహారం విషయంలో మరోసారి జిల్లా రైతును మోసం చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపు కేంద్ర కరువు బృందం రాక

2023-24 రబీ సీజన్‌లో పంట నష్టాన్ని పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం ఈనెల 19న జిల్లాకు రానుంది. రొద్దం మండలం ఆర్ కొట్టాలలో పర్యటించనున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని రెవెన్యూ భవన్‌లో జిల్లాలో కరువు పరిస్థితులపై ఛాయాచిత్రాలతో జిల్లా అధికారులు.. కరువు బృందానికి వివరిస్తారు. మధ్యాహ్నం ఆర్ కొట్టాల, చెరుకూరు పప్పుశనగ రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పప్పుశనగ పంట లేకపోవడంతో జిల్లా యంత్రాగం.. ప్రభుత్వానికి పంపిన నివేదికను అధ్యయనం చేసి, రైతుల ద్వారా కరువు పరిస్థితిని తెలుసుకోనుంది. అధికార యంత్రాంగం పంపిన నివేదికతో రైతుకు ఏమాత్రం ప్రయోజనం చేకూరుతుందోనన్న ఆందోళన నెలకొంది. జిల్లా అంతటినీ కరువు ప్రాంతంగా ప్రకటించి, ఆదుకోవాలని రైతాంగం కోరుకుంటోంది.

కేంద్ర బృందం సభ్యులు వీరే..

పుట్టపర్తిరూరల్: జిల్లాలో ఈనెల 19న కేంద్ర కరువు బృందం సభ్యులు చిన్మయ్ పుండలీకరావ్ గోటమరే (వ్యయ పరిశీలన విభాగ సంచాలకుడు, న్యూఢిల్లీ) నేతృత్వంలో ఆశిష్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవిందకుమార్ సోనీ పర్యటించనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. రొద్దం మండలం ఆర్ కొట్టాల గ్రామంలో పప్పుశనగ రైతులతో వీరు మాట్లాడనున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కరువు పరిస్థితిని అంచనా వేయనున్నారు.



చోళేమర్రిలో ఎండిన పప్పుశనగ పంటలో రైతు వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

అలసంద సాగుచేసి నష్టపోయా



ఏటా రబీలో టమోటా, వేరుశనగ, దోస పంటలు సాగుచేసి, నష్టపోయా. ఈ ఏడాది వాటిని వదిలేసి, అలసంద పంట పెట్టా. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, కలిసి నాలుగు ఎకరాలకు రూ.3లక్షలు ఖర్చు చేశా. పంట దిగుబడి రాక రూ.రెండు లక్షలు నష్టపోయా. వ్యవసాయాధికారులు వచ్చి పంటనష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. పైసా కూడా సాయం అందలేదు.

- సూర్యనారాయణ, రైతు, కొత్తకురువపల్లి, తనకల్లు మండలం

రబీలోనూ నష్టమే..



నాకున్న 3.40 ఎకరాల పొలంలో గత ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసి, నష్టపోయా. రబీలో బోరుబావి కిందైనా పంట పెట్టి, నష్టాల నుంచి గట్టెక్కుదామనుకున్నా. వేరుశనగ, రాగి పంటలు పెట్టా. బోరుబావిలో నీరు తగ్గి, పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.40వేలదాకా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టంపరిహారం చెల్లించి, ఆదుకోవాలి.

- నారాయణప్ప, రైతు, మల్లినమడుగు, రొళ్ల మండలం

మేమేం పాపం చేశాం..?



రబీలో నల్లరేగడి నేలలో వర్షాధారంగా 22 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టా. నవంబరు, డిసెంబరు నెలల్లో చినుకు జాడలేక పంట ఎండిపోయింది. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అందులో కూడా నాసులున్నాయి. దిగుబడిని విక్రయిస్తే కూలీ ఖర్చులు కూడా రాలేదు. అయినా కరువు జాబితాలో మా మండలానికి చోటివ్వలేదు. మా గ్రామం పక్కనే రొద్దం మండల రైతులు వేరుశనగ సాగు చేసి, నష్టపోయారు. ఆ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారు. పంట పెట్టి నష్టపోయినా మాపై కనికరం లేదా? మేమేం పాపం చేశాం?

- వెంకటేశులు, రైతు, అదదాకులపల్లి, పెనుకొండ మండలం





సెజ్ భూముల్లో సేద్యం పనులు



సి-కొడిగేపల్లి వద్ద సెజ్ భూమిలో ట్రాక్టరుతో దున్నుతున్న రైతులు

మడకశిర రూరల్, జూన్ 17: మండలంలో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు సేకరించిన భూముల్లో రైతులు సేద్యం పనులకు శ్రీకారం చుట్టారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో రైతులు సోమవారం సెజ్ భూముల్లో సేద్యం పనులు మొదలెట్టారు. అనంతరం సీ కొడిగేపల్లిలో జంగాలపల్లి పెద్దన్న మాట్లాడారు. పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పి 2006లో వైఎస్ హయాంలో మండలంలోని సి-కోడిగేపల్లి, నల్లానయణపల్లి, కేతేపల్లి, కల్లుమర్రి, అగ్రంపల్లి తదితర గ్రామాల పరిధిలో 660 మంది రైతుల నుంచి 2200 ఎకరాల భూములను కారు చౌకగా తీసుకున్నారన్నారు. పరిశ్రమలు స్థాపించి, భూములిచ్చిన రైతు కుంటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇస్తామని నమ్మబలికారు. భూములు తీసుకుని 17 ఏళ్లయినా నేటికీ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో భూములిచ్చిన రైతులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించిన ఐదేళ్లలోపు పరిశ్రమలు ఏర్పాటు చేయలేకపోతే వాటిని రైతులకు తిరిగి ఇవ్వాల్సి ఉందన్నారు. ఆ మేరకు రైతులు.. తమ భూముల్లో పంటలు వేసుకుంటున్నారని ఆయన వివరించారు.

ఆ విధానాన్ని రద్దు చేయాలి

ఏపీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్



రీడెప్లాయిమెంట్ రద్దు కోరుతూ చేసిన తీర్మానాన్ని చూపుతున్న ఉద్యోగులు

పుట్టపర్తిరూరల్, జూన్ 17: గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రీడెప్లాయిమెంట్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ కోరారు. జిల్లాకేంద్రంలో సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ.. వైద్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఎలను వైసీపీ హయాంలో రీడెప్లాయిమెంట్ పేరుతో సుదూర ప్రాంతాలకు పంపారన్నారు. దీంతో వారు వేతనం ఒకచోట.. విధులు మరోచోట నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దుచేయాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. సమావేశంలో ఎన్జీఓల సంఘం మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, ఉపాధ్యక్షులు గఫూర్, రమాదేవి, సరస్వతి, జ్యోతి పాల్గొన్నారు.



పెనుకొండలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్

పుట్టపర్తిరూరల్, జూన్ 17: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా చేసుకున్నారు. ఉదయాన్నే పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, కదిరి తదితర పట్టణాలు, మండల కేంద్రాల్లో ముస్లింలు మసీదులకు చేరుకున్నారు. వజూ కార్యక్రమం అనంతరం ముస్లింలు ర్యాలీగా ఈద్గా మైదానాలకు చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకొరినొకరు ఆలింగనం చేసుకుని, ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. పలువురు రాజకీయ నేతలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



హిందూపురంలోని అల్‌హిలాల్ ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



బీళ్లను సాగు భూములుగా మార్చడమే లక్ష్యం

● కలెక్టర్ వినోద్‌కుమార్



రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: బీడు భూములను సాగులోకి తీసుకు రావడంతోనే ఎడారీకరణ-కరవు నివారణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ సమ్మిళిత దివ్యాంగుల పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ కరవు-ఎడారీకరణ నివారణ దినోత్సవం సందర్భంగా సదస్సు, ప్రదర్శనశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వర్షాభావ పరిస్థితుల్లో బీడుభూములను సాగులోకి తీసుకురావాలని, ఎడారీకరణ, కరవు సంకేతాలను తిప్పికొట్టేందుకు కనీసం పశుగ్రాసం సాగుచేయాలని రైతులకు సూచించారు. ఎడారీకరణ-కరవు నివారణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరపున సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో తక్కువగా లేదంటే తీవ్రంగా వర్షాలు కురుస్తూ వాతావరణంలో విపరీత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతుకు తమ పొలాల్లో సరిహద్దు మొక్కలుగా నాటేందుకు వంద మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్లుగా జిల్లాలో ఎడారీకరణ-కరవు నివారణకు, నీటి సంరక్షణకు పనిచేస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ జేడీ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాకు సమస్యలు రానివ్వం: సీఈ



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న సీఈ, ఎస్ఈలు

బొమ్మనహాళ్, జూన్ 17: తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే సాగునీటిని ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందిస్తామని హెచ్చెల్సీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఈ రాజశేఖర్‌తో కలిసి ఎగువకాలువను పరిశీలించారు. 181 జీబీసీ ఉంతకల్లు వద్ద 112 కి.మీ. ప్రాంతంలో పడిన గండిని, 119 కి.మీ. చెర్లోపల్లి వద్ద కోతకు గురైన కాలువ గట్లు, యూటీ చానళ్లను పరిశీలించారు. అత్యవసర మరమ్మతుల కింద రూ.50 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సీఈ తెలిపారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 119 కి.మీ. వద్ద దెబ్బతిన్న యూటీ చానల్‌కు రూ.30 లక్షలు, 112 కి.మీ. వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు రూ.10 లక్షలు, 181 జీబీసీ వద్ద దెబ్బతిన్న పనులకు రూ.8 లక్షలు ప్రతిపాదించామని తెలిపారు. వీరితో పాటు ఈఈ రమణారెడ్డి, డీఈ మద్దిలేటి ఉన్నారు.

మంత్రిని కలిసిన యాదవ సంఘం నాయకులు

తాడిపత్రి టౌన్, జూన్ 17: తాడిపత్రి సరిహద్దులోని బొందలదిన్నె గ్రామ సమీపంలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను స్థానిక యాదవసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ అమరావతి నుంచి తాడిపత్రి మీదుగా ధర్మవరం వెళుతుండగా మండల సరిహద్దులో నాయకులు కలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో కడపజిల్లా బుక్కపట్నం పెద్దిరాజు యాదవ్, క్రిష్టయ్య, బొందలదిన్నెకు చెందిన నారాయణయాదవ్, సత్యనారాయణయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, సుబ్బరాయుడుయాదవ్, నాగశేఖర యాదవ్, లింగమయ్య యాదవ్ ఉన్నారు.

సంబరాల్లో దొంగలు పడ్డారు..!

● పోలీసుల అదుపులో నిందితుడు

పామిడి, జూన్ 17: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మొదటిసారిగా జిల్లాకు వస్తుండడంతో తెలుగు తమ్ముళ్ల స్వాగతం పలికేందుకు సోమవారం పెద్దఎత్తున పామిడి పట్టణానికి తరలివచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కచోట గుమికూడడంతో



జేబు కత్తిరించే సమయంలో కోతకు గురైన నోట్లు

దొంగలు తమ చేతులకు పని పెట్టారు. బ్లేడ్‌తో గుంపులోని కొందరి కార్యకర్తల జేబులు కోసి డబ్బులు దొంగలించారు. మండలంలోని నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ డ్రాయర్ జేబు కత్తిరించడంలో తొడకు బ్లేడు కాటు పడింది. దీంతో ఆయన అప్రమత్తం కావడంతో అప్పటికే కొన్ని నోట్లు కట్ అయ్యాయి. కొందరు కార్యకర్తలు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకుని పలువురు తమ జేబులను, డబ్బులను పరిశీలించుకోగా, మరో ఇద్దరు బాధితులు వెలుగులోకి వచ్చారు. పాళ్యం గ్రామానికి చెందిన ఆదినారాయణ రూ.8600, కండ్లపల్లి గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి రూ.20వేలు, నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ రూ.20వేలు చోరీకి గురయ్యాయి. నిందితుడు పోలీసు స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాజు సిబ్బందితో తగిన చర్యలు తీసుకున్నారు.

ఆ.. మాట కోసం..!

● హంద్రీనీవా వెడల్పు ప్రకటనపై రైతుల ఆశలు

● టీడీపీ అధికారంలోకి రావడంతో అంచనాలు

● కాలువ పనులను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



లైనింగ్ పెండింగులో ఉన్న హంద్రీనీవా కాలువ

గుంతకల్లు, జూన్ 17: హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు మరలా ప్రారంభమౌతాయని రైతులు విశ్వసిస్తు న్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు గతంలో చిత్త శుద్ధితో పనిచేశారని, ఈసారి తప్పకుండా వైడెనింగ్ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం పాత కాంట్రాక్టులను రద్దుపరచడమేకాక, కొత్తగా ఎస్టిమేషన్లు, టెండర్లంటూ రెండేళ్లు మభ్యపెట్టి, చివరికి మొండి చేయి చూపింది. చంద్రబాబు ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ వైడెనింగ్ ప్రాజెక్టును ఆయనే పూర్తిచేసి వినియోగంలోకి తెస్తారని రైతులు ఆశాభావా న్ని వ్యక్తం చేస్తున్నారు.

జరగాల్సిన పనులివీ

హంద్రీనీవా వెడల్పు చేసే ప్రాజెక్టును 2017 ఏప్రిల్ 20న చంద్రబాబు నాయుడు ప్రతిపాదించారు. అందుకు సంబంధించిన పైలాన్‌ను పామిడిలో ఆవిష్కరించారు. తొంభై రోజుల కాల వ్యవధి లోపలే పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అయితే ఎస్టిమేష న్లు, టెండర్లు, అగ్రిమెంటు ప్రక్రియ కారణంగా రెండు నెలలు ఆలస్యం జరిగింది. మరో నెలకల్లా కాలువకు నీరు విడుదల కావడంతో పనులు ఆగిపోయాయి. నీరు నిలిచిన తర్వాత పనులు 2018లో పునఃప్రారంభం కాగా ఎన్నికల లోపు 60 శాతం ఆర్త్ వర్కులు పూర్తయ్యాయి. 40 శాతం మట్టిపనులు, మట్టికట్టల (బండ్) నిర్మాణ పనులు, వంతెనలు, స్లూయిజ్ చానళ్ల వద్ద కాలువలో వంద మీటర్ల మేర సిమెంటు లైనింగ్ పనులు జరగాల్సి ఉంది.

ఏటా 40 టీఎంసీల ప్రవాహమేదీ?

హంద్రీనీవా తొలి దశ పనులకు 10 టీఎంసీలు, మలి దశ పనులు పూర్తయితే గరిష్ఠంగా 40 టీఎంసీల నీరు పారేలా కాలువను డిజైన్ చేశారు. కాలువ బెడ్డింగ్ ప్రస్తుతం 10 మీటర్ల వెడల్పుతో ఉంది. కాలువ నిర్మాణం పూర్తయి 2013లో సాగునీటి పారుదల ప్రారంభమైన తర్వాత టీడీపీ హయాంలో 2018-19లో ఒకసారి, వైసీపీ హయాంలో 2020-21లో ఒకసారి మాత్రమే ఎత్తిపోతలు 40 టీఎంసీల మార్కును అందుకున్నాయి. టీడీపీ హయాంలో ప్రతి సంవత్సరం నీటి ఎత్తిపోతల రికార్డును పెంచుకుంటూపోగా, వైసీపీ హయాంలో 2020-21 తర్వాత ప్రతి సంవత్సరమూ నీటి ఎత్తిపోతలు తగ్గుతూ వచ్చాయి. గత సీజన్‌లో దాదాపు 22 టీఎంసీలను మాత్రమే ఇవ్వగలిగారు. కాలువ గరిష్ఠ సామర్థ్యం 40 టీఎంసీల నుంచి రెండింతలు చేయడానికి తొలిదశ కాలువ కింద ఉన్న 216 కి.మీ.ల కాలవను వెడల్పు చేయడానికి చంద్రబాబు సంకల్పించారు. తద్వారా తొలిదశ కాలువకు, జీడిపల్లి రిజర్వాయరు ఎగువన ఉన్న రెండో దశ కాలువకు ఒకేసారి సాగు, తాగునీరు అందించడానికి సాధ్యపడుతుంది. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల ఆ బృహత్కార్యం మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారడం వైడెనింగ్ పనుల పునఃప్రారంభంపై రైతులు ఆశలు పెంచుకున్నారు.

వైడెనింగ్ ప్రకటన కోసం ఎదురుచూపు

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రసంగం చేస్తారని, అందులో వివిధ పాలసీ విషయాలుగా ఆయన మాట్లాడుతారని, హంద్రీనీవా కాలువ వెడల్పుపై ఆయన తప్పక విధానాన్ని ప్రకటిస్తారని రైతులు ఎదురుచూశారు. కానీ ఎటువంటి ప్రసంగం చేయకపోవడంతో త్వరలో వైడెనింగ్ విషయంగా చంద్రబాబు ప్రభుత్వం తప్పక ప్రకటన చేస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు. త్వరలో హంద్రీనీవాకు సాగునీరు విడుదల అవుతున్న తరుణంగా కనీసం ఫిబ్రవరికల్లా వైడెనింగ్ కార్యక్రమంపై కార్యాచరణ జరిగితే ఎత్తిపోతలు ఆగిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయని, వచ్చే సీజన్‌కల్లా వైడెనింగ్ కల సాకారమౌతుందని భావిస్తున్నారు. వైడెనింగ్ పనుల కారణంగా హంద్రీనీవా కాలువలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టడంలేదు. దీనివల్ల కాలవలో నిర్మించిన మట్టికట్టలు శిథిలమౌతూ, కెనాల్‌లోకి జారిపోతున్నాయి. వైడెనింగ్ ప్రారంభమైతే కాలువ పటిష్టం అవుతుందని రైతులు చెబుతున్నారు.



మట్టికట్ట బలహీనపడిన హంద్రీనీవా కాలువ

కాలువ వెడల్పు పూర్తి చేయాలి



హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ప్రారంభించింది చంద్రబాబునాయుడే. ఇప్పుడు మళ్లా ఆయనే ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి వీలైనంత త్వరగా పూర్తి చేస్తారన్న నమ్మకం ఉంది. వచ్చే సీజనుకల్లా పనులు పూర్తి చేసి కాలవలో భారీ స్థాయిలో నీటిని పారించాలి.

- కందుల ప్రసాద రెడ్డి, కసాపురం రైతు

బాబుపై నమ్మకముంది



వైసీపీ హయాంలో కాలవ వెడల్పు పనులు చేయలేదు. కనీసం ఫిబ్రవరి ఆఖరు వరకూ కూడా నీరివ్వలేదు. మిర్చి రైతులకు నిరుడు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. కాలువ వెడల్పు పనులు పూర్తిచేయగలిగింది చంద్రబాబే. ఆయన హయాంలో పనులు తప్పక పూర్తవుతాయన్న నమ్మకముంది.

- బీ కొండప్ప, కసాపురం రైతు

కాలువ వెడల్పు పూర్తయ్యాక ఆయకట్టు ఇవ్వాలి



హంద్రీనీవా కింద గుంతకల్లు మండలానికి ఆయకట్టును ఇవ్వలేదు. వీలైనంత త్వరగా కాలువ వెడల్పు పనులు చేపట్టి పూర్తిచేయాలి. ఈ మండలానికి ఆయకట్టును స్థిరీకరించాలి. కసాపురానికి సమీపంలోనే కాలువ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కానీ మాకు ఆయకట్టును ఇవ్వలేదు. వెడల్పు తర్వాత ఎక్కువ నీరు వస్తుంది కనుక మాకు ఆయకట్టును ఇవ్వాలి.

- శేఖర్, కసాపురం రైతు

చంద్రబాబు పూర్తి చేస్తారు



చంద్రబాబు రైతులకు మేలు జరగాలని ఎంతో చిత్తశుద్ధితో హంద్రీనీవా కాలువ వెడల్పు చేపట్టారు. కానీ జగన్ ప్రభుత్వం కక్షగట్టి ఆ పనులను ఆపేసింది. చంద్రబాబు హంద్రీనీవాకు ముచ్చుమర్రి పంప్ హౌస్ నుంచి నీరిచ్చారు. వె డల్పు చేయడానికి రూపకల్పన చేశారు. రైతులకు మే లు చేయాలన్న ఆయన సంకల్పం అతి త్వరలో పూర్తవుతుందని భావిస్తున్నాం.

- భాస్కర్, కసాపురం రైతు

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయం

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 17: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆర్మీ ఆర్టిలరీ విభాగం డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ యాత్ర ఆదివారం అనంతపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో కలెక్టర్ వినోద్ కుమార్ అనంతపురం నుంచి జమ్మూకాశ్మీర్‌లోలోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకునే ఈ యాత్రను సోమవారం ఉదయం స్థానిక పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో జెండాను ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఎంతో మంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. కార్గిల్ విజయ్ దివస్ 26వ తేదీతో రజతోత్సవం జరుపుకుంటుందన్నారు. వీరులను స్మరించుకుంటూ దేశం నలుమూలల యువత, మాజీ సైనికులు, ప్రజల్లో దేశభక్తి, కార్గిల్ వీరుల స్ఫూర్తిని నింపడం కోసం ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ధనుష్కోడి, ద్వారకా, డింజెన్, ఢిల్లీ నుంచి కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్ డి-5 మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభమైందన్నారు. ఈ నెల 26న జమ్మూకాశ్మీర్‌లోని



యాత్రలో పాల్గొన్న ఆర్మీ, మాజీ సైనికులతో జిల్లా కలెక్టర్

ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకొని కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ మహోత్సవాలను ఇండియన్ ఆర్మీ జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, సార్జెంట్ సంజీవకుమార్, సుబేదార్ మహమ్మద్ ఇర్షాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టీకే కృష్ణ, మాజీ సైనికులు ఆర్ఎస్ నాగరాజు, తిమ్మారెడ్డి, పెంచలయ్య, వై. ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, అల్లాబక్ష్, సాయికుమార్, గిరీష్, బాబా ఫకృద్దీన్, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, కార్గిల్ మోటార్ సైకిల్ యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్దప్ప పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ యోజన సొమ్ము విడుదల

పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల వివరాలను కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షల మంది రైతులకు 106 కోట్లకు పైగా లబ్ధిచేకూరనుంది. అనంతపురం జిల్లాలో 2.76 లక్షల మంది రైతులకు 55.58 కోట్ల రూపాయలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులకు 50.44 కోట్ల రూపాయల లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ సొమ్మును కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేయనుంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (ఏప్రిల్-జులై 2024) 17వ వాయిదా కింద ఒక్కో రైతు ఖాతాలో రెండు వేల రూపాయలను కేంద్ర ప్రభుత్వం జమ చేయనుంది. తాజాగా విడుదల చేసే సొమ్ములో పీఎం కిసాన్ బకాయి మొత్తాలు కూడా కలిసి ఉంటాయి.

- అనంతపురం

బాలిక అనుమానాస్పద మృతి



ప్రమీల (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 17: మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టు వెంకటేష్ కుమార్తె ప్రమీల (16) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ వంశీకృష్ణ సోమవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడగొట్టు వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కాగా రెండో కుమార్తె ప్రమీల, ఆమె సోదరుడు ఆదివారం ఇంట్లో గొడవపడ్డారు. దీంతో తల్లిదండ్రులు ఆ బాలికను మం దలించారు. దీంతో ఆమె అలిగి ఇంటి నుంచి బయటికెళ్లిపోయింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, స్నేహితురాళ్ల ఇళ్లల్లో గాలించారు. ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని చెక్ డ్యామ్ వద్ద బాలిక చెప్పులు కనిపించడంతో.. అనుమానం వచ్చి చెక్ డ్యామ్‌లో గాలించగా, ప్రమీల శవం లభ్యమైందన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మంత్రి సత్యకుమార్ ధర్మవరం రాక

● భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు

ధర్మవరం, జూన్ 17: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరానికి మంగళవారం రానున్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా నియోజకవర్గానికి రానుండటంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. తిరుమల దర్శనానంతరం సోమవారం రాత్రికి అనంతపురానికి చేరుకుంటారు. మంత్రితోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి వస్తుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి రోడ్డు మార్గాన బత్తలపల్లి మండలం యర్రాయపల్లి వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ఎత్తున వాహనాల ర్యాలీతో బత్తలపల్లి మీదుగా గొట్లూరుకు చేరుకుంటారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైక్ ర్యాలీతో ధర్మవరం పట్టణంలోకి అడుగుపెడతారు. కదిరిగేటు వద్ద చేనేత విగ్రహానికి పూలమాల వేసి దిమ్మెలసెంటర్ మీదుగా, తేరుబజారు నుంచి దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. అక్కడి నుంచి దుర్గానగర్ ఎదురుగా ఉన్న నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంత్రి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతారు. అక్కడి నుంచి కూటమి కార్యాలయానికి చేరుకుంటారు. ఇందు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలకు గొట్లూరు గ్రామానికి చేరుకుని సత్యకుమార్, పరిటాలశ్రీరామ్‌లకు స్వాగతం పలికి అక్కడి నుంచి ధర్మవరంలోని కూటమి కార్యాలయం వద్దకు చేరుకునే వరకు ర్యాలీ కొనసాగుతుందని శ్రేణులు పేర్కొన్నాయి. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు బైక్‌లలో వచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



ఎర్రిస్వామి (ఫైల్)

బెళుగుప్ప, జూన్ 17: మండలంలోని కాలువపల్లికి చెందిన యువరైతు ఎర్రిస్వామి(30) అప్పులబాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రిస్వామికి పది ఎకరాల పొలం ఉంది. అందులో మిరప, వేరుశనగ తదితర పంటలను సాగు చేసేవాడు. సాగునీటి కోసం పది బోరు బావులు తవ్వించగా ఒకదాంట్లో నీరు పడింది. ఆ బోరు కూడా ఇటీవల ఎండిపోయింది. దీంతో ఐదు ఎకరాల్లో సాగుచేసిన మిరప పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. దీనికితోడు గిట్టుబాటు ధర లభించలేదు. బోరు బావులు, పెట్టుబడి కోసం తెచ్చిన రూ.20 లక్షల అప్పు వడ్డీతో రూ.29 లక్షలకు చేరింది. వాటిని తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మిరప పంటకు తెచ్చిన పురుగు మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రైతు భార్య ప్రియాకం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 444 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పగలు ఎండ వేడి... రాత్రికి జడివాన..!

● తెగుళ్లతో అన్నదాతలు కుదేలు

● వర్షంతో పంటలకు సోకిన మచ్చతెగులు

కళ్యాణదుర్గం, జూన్ 17: ఉదయం ఎండ వేడి... రాత్రికి జడివానతో అన్నదాత కుదేలవుతున్నాడు. పంట ఎదుగుదల వచ్చే సమయంలో వర్ష ప్రభావంతో పంటలకు మచ్చతెగులు సోకి పంటను కాపాడుకోలేక పోతున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. ఈ రబీలో కర్బూజ, కళింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో 800 ఎకరాలకుపైగా పంటలు సాగు చేశారు. ఎక్కువగా టమోటా, కర్బూజ వేశారు. కర్బూజ పంట కోత సమయంలో వారం రోజులు కురిసిన జడివానతో పంటంతా నాశనమైంది. వర్షం రాకముందు కర్బూజ టన్ను ధర రూ.30 వేలు ఉండేది. అదే వర్షం వచ్చిన తర్వాత టన్ను రూ.8 వేలకు పడిపోయింది. అసలు కాయలను కొనేవారు లేక తోటల్లోనే వదిలేశా రు. ఈ కర్బూజ పంటనే 120 ఎకరాలకు పైగా నియోజకవర్గ వ్యాప్తంగా సాగు చేశారు. రూ.కోటికి పైగా నష్టపోయినట్లు తెలుస్తోంది. దాంతో పాటు టమోటాకు మచ్చతెగులు సోకి, కాసిన పూతంతా రాలిపోయింది. ఈ పూతను దక్కించుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో పాటు బీరకాయ పంటకు కూడా మచ్చతెగులు, ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి, ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో బూడిద తెగులు వచ్చి దిగుబడులపై ప్రభావం చూపింది. జడివానతో అన్నదాతలకు దడ పుట్టించి, ఆర్థికంగా నష్టానికి గురి చేసింది.



తోటలోనే వదిలేసిన కర్బూజ పంట



టమోటాకు ఎరుపు రంగులో ఉన్న తెగులు

కర్బూజ కాయలను తోటలోనే వదిలేశా



తనకున్న మూడు ఎకరాల పొలంలో కర్బూజ పంటను సాగు చేశా. కొనేందుకు వ్యాపారులు ఏ ఒక్కరూ రాకపోవడంతో తోటలనే పంటంతా వదిలేశా. వర్షం ధాటికి కొనేందుకు ఏ ఒక్కరూ రావడం లేదు. రూ. 2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. - నాగార్జున, రైతు, కళ్యాణదుర్గం

బీరపంటకు మచ్చతెగులు



తనకున్న మూడు ఎకరాల పొలంలో వర్షం ధాటికి బీర పంట అంతా మచ్చతెగులు సోకి నష్టపోయా. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ఆకుముడత, బూడిద, ఎరుపు రంగులోకి ఆకులన్నీ మారిపోయి పంటంతా పనికిరాకుండి పోయింది. - లక్ష్మీరెడ్డి, రైతు, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు


కదిరిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


ధర్మవరంలోని ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు, పాల్గొన్న పరిటాలశ్రీరామ్


గాండ్లపెంటలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు..

భక్తిశ్రద్ధలతో.. బక్రీద్

● ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలను సోమవారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నియోజకవర్గాల కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం వేడుకలను జరిపారు. ఉదయాన్నే ముస్లింలు సమీపంలోని ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, ముతవల్లులు పండగ ప్రత్యేకతను వివరించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని వివరించారు. తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్దకు పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తర్వాత ముస్లింలు ఇళ్లకు బంధుమిత్రులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఎన్‌పీకుంట మండలం పెడబల్లి ఈద్గా వద్ద..


ఓడీసీలోని ఈద్గా వద్ద..


బత్తలపల్లిలోని ఈద్గా వద్ద ..


తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ సమీపంలోని ఈద్గా వద్ద..


ముదిగుబ్బలో ఈద్గా మైదానం వద్దకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

తిరుమలకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ శ్రేణులు

నల్లచెరువు, జూన్ 17: కూటమి అధికారంలోకి రావడంతో మండలంలోని పెద్దయల్లంపల్లికి చెందిన టీడీపీ శ్రేణులు సోమవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నామన్నారు. దీంతో కోరిక నెరవేరడంతో మొక్కు తీర్చుకునేందుకు బయలుదేరుతున్నామన్నారు. కూటమి గెలుపుతో రాక్షస పాలన పోయి, రామరాజ్యం వచ్చిందన్నారు. తిరుమలకు వెళ్లినవారిలో జగదీష్, లక్ష్మీపతి, రాజేంద్ర, రమేష్, రామక్రిష్ణ, రాజశేఖర్, ప్రకాష్, నాగరాజు, ఎన్. లక్ష్మీపతి, దుబాయి శీను, వేమూరి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు


టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

తనకల్లు, జూన్ 17: మండలంలోని బాలసముద్రం గ్రామ సమీపంలో వెలసిన జంబులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం టీడీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయం వెలుపల 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. తర్వాత నాయకుడు సోంపాళ్యం నాగభూషణం మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావాలని, కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ గెలవాలని మొక్కుకున్నామని, కోరిక నెరవేరడంతో ఇప్పుడు మొక్కు తీర్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇక మంచిరోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూగిడె చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి పీసీ మల్లికార్జున, నాయకులు బాగేపల్లి అశోక్, వేణుగోపాలనాయుడు, ఆదినారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగి పడిన విద్యుత్ వైరు.. తప్పిన ప్రమాదం

నంబులపూలకుంట, జూన్ 17: మండలంలోని దిగువపల్లి గ్రామ సమీపంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో సోమవారం 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడింది. మధ్యాహ్న సమయంలో మంటలు వ్యాపించి స్తంభానికి అమర్చిన వైరు ఉన్నట్టుండి తెగిపోయి కిందపడింది. పక్క పొలాల్లో రైతులు గమనించి వెంటనే సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఆ సమయంలో ఆ దారిలో ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వైర్లు కూడా కిందకు వేలాడుతున్నాయని, సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించామని, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తెగిపడిన విద్యుత్ వైరును మరమ్మతు చేయడంతో పాటు కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


స్తంభం నుంచి తెగిన విద్యుత్ వైరు

టీడీపీ కార్యకర్త మృతికి పరిటాల శ్రీరామ్ నివాళి

ధర్మవరం, జూన్ 17: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన టీడీపీ కార్యకర్త గంజిగడ్డ చెన్నకేశవ(45) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్ తదితరులు వెళ్లి చెన్నకేశవ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట 24, 25 వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెన్నకేశవ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాలశ్రీరామ్

బాలిక అనుమానాస్పద మృతి


ప్రమీల (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 17: మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టు వెంకటేష్ కుమార్తె ప్రమీల (16) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ వంశీకృష్ణ సోమవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడగొట్టు వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కాగా రెండో కుమార్తె ప్రమీల, ఆమె సోదరుడు ఆదివారం ఇంట్లో గొడవపడ్డారు. దీంతో తల్లిదండ్రులు ఆ బాలికను మందలించారు. దీంతో ఆమె అలిగి ఇంటి నుంచి బయటికెళ్లిపోయింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, స్నేహితురాళ్ల ఇళ్లల్లో గాలించారు. ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని చెక్ డ్యామ్ వద్ద బాలిక చెప్పులు కనిపించడంతో.. అనుమానం వచ్చి చెక్ డ్యామ్‌లో గాలించగా, ప్రమీల శవం లభ్యమైందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

20న ఉచిత వైద్య శిబిరం

నల్లచెరువు, జూన్ 17: మండలకేంద్రంలోని షిర్డీ సాయి ఆలయం వద్ద ఈ నెల 20వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మదనపల్లికి చెందిన శ్రీ వెంకటేశ్వర ఆస్పత్రి వైద్యుడు బాలకిశోర్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గుండెనొప్పి, కాళ్ల వాపు, ఆస్తమా, శ్వాసకోశ, అలర్జీ, బీపీ, షుగర్, ఊపిరితిత్తుల్లో నెమ్ము తదితరవ్యాధులకు ఉచితంగా చికిత్స చేస్తారన్నారు. అవకాశాన్ని వ్యాధిగ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కేజీబీవీల్లో తరగతి గదులను పెంచాలి

ముదిగుబ్బ, జూన్17: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో తరగతి గదులను పెంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు కేటాయించాలని బీసీ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీల ప్రవేశానికి ఆన్‌లైన్లో అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రతిఒక్క విద్యార్థినికి సీటు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు గోపాల్, రామకృష్ణ, రామ్మోహన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన యాదవ సంఘం నాయకులు


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తాడిపత్రిటౌన్, జూన్ 17: తాడిపత్రి సరిహద్దులోని బొందలదిన్నె గ్రామ సమీపంలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను స్థానిక యాదవసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ అమరావతి నుంచి తాడిపత్రి మీదుగా ధర్మవరం వెళుతుండగా మండల సరిహద్దులో నాయకులు కలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో కడపజిల్లా బుక్కపట్నం పెద్దిరాజు యాదవ్, క్రిష్టయ్య, బొందలదిన్నెకు చెందిన నారాయణయాదవ్, సత్యనారాయణయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, సుబ్బరాయుడుయాదవ్, నాగశేఖర యాదవ్, లింగమయ్య యాదవ్ ఉన్నారు.

సంబరాల్లో దొంగలు పడ్డారు..!

● పోలీసుల అదుపులో నిందితుడు


జేబు కత్తిరించే సమయంలో కోతకు గురైన నోట్లు

పామిడి, జూన్ 17: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మొదటిసారిగా జిల్లాకు వస్తుండడంతో తెలుగు తమ్ముళ్ల స్వాగతం పలికేందుకు సోమవారం పెద్దఎత్తున పామిడి పట్టణానికి తరలివచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కచోట గుమికూడడంతో దొంగలు తమ చేతులకు పని పెట్టారు. బ్లేడ్‌తో గుంపులోని కొందరి కార్యకర్తల జేబులు కోసి డబ్బులు దొంగలించారు. మండలంలోని నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ డ్రాయర్ జేబు కత్తిరించడంలో తొడకు బ్లేడు కాటు పడింది. దీంతో ఆయన అప్రమత్తం కావడంతో అప్పటికే కొన్ని నోట్లు కట్ అయ్యాయి. కొందరు కార్యకర్తలు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకుని పలువురు తమ జేబులను, డబ్బులను పరిశీలించుకోగా, మరో ఇద్దరు బాధితులు వెలుగులోకి వచ్చారు. పాళ్యం గ్రామానికి చెందిన ఆదినారాయణ రూ.8600, కండ్లపల్లి గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి రూ.20వేలు, నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ రూ.20వేలు చోరీకి గురయ్యాయి. నిందితుడు పోలీసు స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాజు సిబ్బందితో తగిన చర్యలు తీసుకున్నారు.

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయం

● కలెక్టర్ వినోద్‌కుమార్


యాత్రలో పాల్గొన్న ఆర్మీ, మాజీ సైనికులతో జిల్లా కలెక్టర్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 17: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆర్మీ ఆర్టిలరీ విభాగం డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ యాత్ర ఆదివారం అనంతపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో కలెక్టర్ వినోద్ కుమార్ అనంతపురం నుంచి జమ్మూకాశ్మీర్‌లోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకునే ఈ యాత్రను సోమవారం ఉదయం స్థానిక పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో జెండాను ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఎంతో మంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. కార్గిల్ విజయ్ దివస్ 26వ తేదీతో రజతోత్సవం జరుపుకుంటుందన్నారు. వీరులను స్మరించుకుంటూ దేశం నలుమూలల యువత, మాజీ సైనికులు, ప్రజల్లో దేశభక్తి, కార్గిల్ వీరుల స్ఫూర్తిని నింపడం కోసం ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ధనుష్కోడి, ద్వారకా, డింజెన్, ఢిల్లీ నుంచి కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్ డి-5 మోటర్ సైకిల్ యాత్ర ప్రారంభమైందన్నారు. ఈ నెల 26న జమ్మూకాశ్మీర్‌లోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకొని కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ మహోత్సవాలను ఇండియన్ ఆర్మీ జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, సార్జెంట్ సంజీవకుమార్, సుబేదార్ మహమ్మద్ ఇర్షాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టీకే కృష్ణ, మాజీ సైనికులు ఆర్ఎస్ నాగరాజు, తిమ్మారెడ్డి, పెంచలయ్య, వై. ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, అల్లాబక్ష్, సాయికుమార్, గిరీష్, బాబా ఫకృద్దీన్, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, కార్గిల్ మోటార్ సైకిల్ యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్దప్ప పాల్గొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ ధర్మవరం రాక

● భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు

ధర్మవరం, జూన్ 17: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరానికి మంగళవారం రానున్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా నియోజకవర్గానికి రానుండటంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. తిరుమల దర్శనానంతరం సోమవారం రాత్రికి అనంతపురానికి చేరుకుంటారు. మంత్రితోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి వస్తుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి రోడ్డు మార్గాన బత్తలపల్లి మండలం యర్రాయపల్లి వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ఎత్తున వాహనాల ర్యాలీతో బత్తలపల్లి మీదుగా గొట్లూరుకు చేరుకుంటారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైక్ ర్యాలీతో ధర్మవరం పట్టణంలోకి అడుగుపెడతారు. కదిరిగేటు వద్ద చేనేత విగ్రహానికి పూలమాల వేసి దిమ్మెలసెంటర్ మీదుగా, తేరుబజారు నుంచి దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. అక్కడి నుంచి దుర్గానగర్ ఎదురుగా ఉన్న నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంత్రి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతారు. అక్కడి నుంచి కూటమి కార్యాలయానికి చేరుకుంటారు. ఇందు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలకు గొట్లూరు గ్రామానికి చేరుకుని సత్యకుమార్, పరిటాలశ్రీరామ్‌లకు స్వాగతం పలికి అక్కడి నుంచి ధర్మవరంలోని కూటమి కార్యాలయం వద్దకు చేరుకునే వరకు ర్యాలీ కొనసాగుతుందని శ్రేణులు పేర్కొన్నాయి. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు బైక్‌లలో వచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు పీఎం కిసాన్ యోజన సొమ్ము విడుదల

పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల వివరాలను కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షల మంది రైతులకు 106 కోట్లకు పైగా లబ్ధిచేకూరనుంది. అనంతపురం జిల్లాలో 2.76 లక్షల మంది రైతులకు 55.58 కోట్ల రూపాయలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులకు 50.44 కోట్ల రూపాయల లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ సొమ్మును కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేయనుంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (ఏప్రిల్-జూలై 2024) 17వ వాయిదా కింద ఒక్కో రైతు ఖాతాలో రెండు వేల రూపాయలను కేంద్ర ప్రభుత్వం జమ చేయనుంది. తాజాగా విడుదల చేసే సొమ్ములో పీఎం కిసాన్ బకాయి మొత్తాలు కూడా కలిసి ఉంటాయి.

- అనంతపురం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గార్లదిన్నె, జూన్ 17 : స్థానిక శింగనమల క్రాస్ సమీపంలోని సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో సోమవారం విద్యుదాఘాతంతో ప్రకాష్‌కుమార్ (25) మరణించాడు. బీహార్‌కు చెందిన ఇతనితో పాటు సంతోష్, గోవింద్, రామ్‌జీ, నిమలేష్ రెండు నెలలు నుంచి గార్లదిన్నెలోని బ్రిక్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. సోమవారం ప్రకాష్ కుమార్ సిమెంట్ ఇటుకలకు నీరు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రకాష్ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని నెమలి..

అనంతపురం క్రైం, జూన్ 17: స్థానిక హెచ్చెల్సీ కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని జాతీయ పక్షి నెమలి సోమవారం మరణించింది. త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు పరిశీలించి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారెప్పకు సమాచారం అందజేశారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


ఎర్రిస్వామి (ఫైల్)

బెళుగుప్ప, జూన్ 17: మండలంలోని కాలువపల్లికి చెందిన యువరైతు ఎర్రిస్వామి(30) అప్పులబాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రిస్వామికి పది ఎకరాల పొలం ఉంది. అందులో మిరప, వేరుశనగ తదితర పంటలను సాగు చేసేవాడు. సాగునీటి కోసం పది బోరు బావులు తవ్వించగా ఒకదాంట్లో నీరు పడింది. ఆ బోరు కూడా ఇటీవల ఎండిపోయింది. దీంతో ఐదు ఎకరాల్లో సాగుచేసిన మిరప పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. దీనికితోడు గిట్టుబాటు ధర లభించలేదు. బోరు బావులు, పెట్టుబడి కోసం తెచ్చిన రూ.20 లక్షల అప్పు వడ్డీతో రూ.29 లక్షలకు చేరింది. వాటిని తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మిరప పంటకు తెచ్చిన పురుగు మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రైతు భార్య ప్రియాకం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.33 వేలు

అనంతపురంరూరల్, జూన్ 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 444 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పగలు ఎండ వేడి... రాత్రికి జడివాన..!


● తెగుళ్లతో అన్నదాతలు కుదేలు
● వర్షంతో పంటలకు సోకిన మచ్చతెగులు

కళ్యాణదుర్గం, జూన్ 17: ఉదయం ఎండ వేడి... రాత్రికి జడివానతో అన్నదాత కుదేలవుతున్నాడు. పంట ఎదుగుదల వచ్చే సమయంలో వర్ష ప్రభావంతో పంటలకు మచ్చతెగులు సోకి పంటను కాపాడుకోలేక పోతున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదు. ఈ రబీలో కర్భూజ, కళింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో 800 ఎకరాలకుపైగా పంటలు సాగు చేశారు. ఎక్కువగా టమోటా, కర్భూజ వేశారు. కర్భూజ పంట కోత సమయంలో వారం రోజులు కురిసిన జడివానతో పంటంతా నాశనమైంది. వర్షం రాకముందు కర్భూజ టన్ను ధర రూ.30 వేలు ఉండేది. అదే వర్షం వచ్చిన తర్వాత టన్ను రూ.8 వేలకు పడిపోయింది. అసలు కాయలను కొనేవారు లేక తోటల్లోనే వదిలేశారు. ఈ కర్భూజ పంటనే 120 ఎకరాలకు పైగా నియోజకవర్గ వ్యాప్తంగా సాగు చేశారు. రూ.కోటికి పైగా నష్టపోయినట్లు తెలుస్తోంది. దాంతో పాటు టమోటాకు మచ్చతెగులు సోకి, కాసిన పూతంతా రాలిపోయింది. ఈ పూతను దక్కించుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో పాటు బీరకాయ పంటకు కూడా మచ్చతెగులు, ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి, ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో బూడిద తెగులు వచ్చి దిగుబడులపై ప్రభావం చూపింది. జడివానతో అన్నదాతలకు దడ పుట్టించి, ఆర్థికంగా నష్టానికి గురి చేసింది.


తోటలోనే వదిలేసిన కర్భూజ పంట


టమోటాకు ఎరుపు రంగులో ఉన్న తెగులు

కర్భూజ కాయలను తోటలోనే వదిలేశా



తనకున్న మూడు ఎకరాల పొలంలో కర్భూజ పంటను సాగు చేశా. కొనేందుకు వ్యాపారులు ఏ ఒక్కరూ రాకపోవడంతో తోటలనే పంటంతా వదిలేశా. వర్షం ధాటికి కొనేందుకు ఏ ఒక్కరూ రావడం లేదు. రూ. 2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. - నాగార్జున, రైతు, కళ్యాణదుర్గం

బీరపంటకు మచ్చతెగులు



తనకున్న మూడు ఎకరాల పొలంలో వర్షం ధాటికి బీర పంట అంతా మచ్చతెగులు సోకి నష్టపోయా. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ఆకుముడత, బూడిద, ఎరువు రంగులోకి ఆకులన్నీ మారిపోయి పంటంతా పనికిరాకుండి పోయింది. - లక్ష్మీరెడ్డి, రైతు, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు

చేనేతల సమస్యలను పరిష్కరిస్తాం

ధర్మవరం, జూన్ 17: చేనేతల సమస్యలను తప్పక పరిష్కరిస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. గత ఫిబ్రవరిలో నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలో చేనేత కుటుంబాలను పరామర్శించి, అధికారంలోకి రాగానే అండగా ఉంటామని భరోసా కల్పించిన విషయం తెలిసిందే. నారా భువనేశ్వరి ఇచ్చిన హామీ మేరకు సోమవారం పరిటాల శ్రీరామ్ చేనేత కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు చేనేతలు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొన్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని, దీనికితోడు ముడిసరుకులు రెట్టింపు అయ్యాయని, నేసిన చీరలకు గిట్టుబాటు ధర కూడా రాలేదని వాపోయారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. ఇక మన ప్రభుత్వం వచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలను అన్ని విధాలుగా ఆదుకుంటాడని భరోసా ఇచ్చారు. టీడీపీ హయాంలో ఉన్న పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్ర చౌద రి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, అంబటిసనత్, ఊట్లనరేంద్ర, చిన్నూరు విజయ్‌చౌదరి, దుర్గేశ్, భాస్కర్‌చౌదరి, జిలకర శీనా తదితరులు పాల్గొన్నారు.



చేనేతతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Pulivendula branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Jeengala Obulanaidu** S/o late J. Chinna Obaiah, residing at H.No. 4-7, Dampalli, Odulapalli Village and Post, Thalapula Mdl. Anantapur Dt. under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions are any individual money lenders are hereby informed that if any objections regarding the said loan property, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned property, otherwise it shall be deemed that there are no objections from anybody and any objections received after **Five days** will not binding upon my client's company for the below mentioned schedule property. **SCHEDULE**: Ananthapuram Dt, Hindupuram registration district, Kadiri Sub-District, Kadiri Mandal, Kadiri rural (Kummaravandlapalli) Panchayathi area, Kadiri village fields (Thummala road) S.No. 193 extent of Ac. 4.61 cents out of Ac. 1.01 cents laid plots out of it plot No. 25 measuring 132 Sq. yards comprise vacant site within the following **BOUNDARIES:** East-Kadiri-Thummala road, West - Plot No. 28 open site, North - 20 feet width of road, South - Plot No. 26 open site. **In between measuring** : East, West side North-South ; 18; - 0" feet or 5.490 meters, Northern side East-West 68-0 feet or 24.740 meters, Southern side East-West 64-0 feet or 19.520 meters. Measures comprise 132 Sq. yards comprise oper site full.

A. Narasimha Reddy, M.A., B.Ed., B.L.
Advocate, Pulivendula

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు శ్రీమతి మాసినేని శ్రీలత W/o M.చంద్రశేఖర్ చౌదరి అను పేరున గల ఆస్తి తాకట్టుపై మనుబోలు చంద్రశేఖర్ చౌదరి D.No. 6-1-128-2, జన్మభూమి రోడ్డు, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నయెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రిజి॥ అనంతపురం సబ్ రిజి॥కి చేరిన అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి గ్రామ పంచాయితీ పరిధి లోని సర్వేనెం.206/1లో 6.86 ఎకరాల భూమి వివరం

చెక్కుబంది:-తూర్పు :టి.సుబ్రమణ్యం & బి.నాగిరెడ్డి భూమి, పడమర: కె.కదిరి రెడ్డి భూమి, ఉత్తరం: సర్వేనెం. 207/1లో ఎమ్.రామయ్య భూమి, దక్షిణం: కట్టకిందపల్లి గ్రామ భూమి.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907

రాయల విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

కదిరిఅర్బన్, జూన్ 17: పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు స్థానిక బలిజ సేవా సంఘం వారు సోమవారం భూమిపూజ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్యఅతిథిగా వచ్చి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విజయనగరసామ్రాజ్య చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు గొప్ప పరిపాలన చేశారన్నారు. వందల ఏళ్ల క్రితం ఆయన తవ్వించిన చెరువులు, కట్టించిన ఆనకట్టలు, ఆలయాలు, గోపురాలు నేటికీ దర్శనమిస్తున్నాయన్నారు. ఆయన పాలన నేటి పాలకులకు ఆదర్శమని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, బ్లూమూన్ శివశంకర్, బలిజసంఘం నాయకులు రమేష్‌బాబు, నాగరాజు, శ్రీనివాసులు, జనార్దన్, నాగేంద్రప్రసాద్, శివశంకర్, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

117 జీఓను రద్దు చేయాలి

ధర్మవరం, జూన్ 17: జీఓ నంబర్ 117ను పూర్తిగా రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా 12వ పీఆర్సీని తక్షణం అమలు చేయాలని, ఉపాధ్యాయ నియామకాలలో అప్రెంటీస్ విధానాన్ని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, రాష్ట్ర విద్యావ్యవస్థలో ఒకే సిలబస్ అమలు చేయాలని విన్నవించారు.

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, జూన్ 17: మండలంలోని దాదిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేకువజామునే పూజారి వెంకటేష్ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 17: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు మడకశిర నియోజకవర్గంలోనే ఉచిత శిక్షణను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వారు సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. మడకశిర నియోజకవర్గంలో డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు వారికి అవసరమైన మెటీరియల్‌తో పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కోసం పట్టణంలోని బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. తక్కువ మంది అభ్యర్థులు ఉంటేవారు కోరినచోటే డీఎస్సీ శిక్షణ కోసం తాము అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మడకశిర నియోజకవర్గంలో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ రాజీనామా

హిందూపురం, జూన్ 17: పట్టణంలో వెలసిన పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ సోమవారం సాయంత్రం రాజీనామా చేసినట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ప్రభుత్వం మారడంతో... గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన వారు తమ పదవులకు రాజీనామా చేయాలని సంబంధిత శాఖల కమిషనర్లు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా పేట వెంకటరమణస్వామి ఆలయ కమిటీ చైర్మన్ భగీరథ, నవీన్‌చంద్రతో పాటు ఏడుగురు సభ్యులు రాజీనామా చేశారు. రాజీనామాలను విజయవాడలోని గొల్లపూడి దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక రూపంలో పంపనున్నట్లు ఈఓ తెలిపారు.

బీజేపీ పేరుతో అక్రమ వసూలు

పోలీసులకు పార్టీ నాయకుల ఫిర్యాదు

గోరంట్ల, జూన్ 17: బీజేపీ వారిమంటూ మండలంలో కొంత మంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల మండలంలో పశువులను 407 వాహనంలో తరలిస్తున్న రైతుల నుంచి కొందరు బీజేపీ వాళ్లమని చెప్పి వసూలు చేసినట్లు తమకు తెలిసిందన్నారు. అలా అక్రమ వసూళ్లకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై సీఐ సుబ్బరాయుడును వివరణ కోరగా, అక్రమ వసూలుకు పాల్పడిన వారి వివరాలు తెలియజేయలేదన్నారు. రైతులను పిలిపించి విచారించి చర్యలు చేపడతామన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఇంట్లో చోరీ

మడకశిర రూరల్, జూన్ 17: మండలంలోని ఈ గొల్లహట్టి గ్రామంలో తన ఇంట్లో తాగునీటి తొట్టికి అమర్చిన విద్యుత్ మోటారును గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారని అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న రత్నమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ... ఎవరూలేని ఇళ్లలోను, ఇంటి ఎదుట ఉన్న వస్తువులను, విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టిసాధించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మహిళా రైతుకు పాముకాటు

గోరంట్ల, జూన్ 17: మండలంలోని మర్రెడ్డిపల్లికి చెందిన మహిళా రైతు లీలావతి సోమవారం పాముకాటుకు గురై అస్వస్థత పొందారు. మర్రెడ్డిపల్లికి చెందిన రామచంద్ర భార్య లీలావతి ఉదయం పొలంలో పనులు చేస్తుండగా నాగుపాము కుడిచేయి మణికట్టుపై కాటు వేసిందని కుటుంబసభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 17: మండలంలోని సిరంగం వాండ్లపల్లికి చెందిన సుధాకర్ అధిక మోతాదులో మాత్రలు మింగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిరంగంవాండ్లపల్లికి చెందిన ఆంజనేయులు కుమారుడు సుధాకర్ కుటుంబ కలహాలతో విరక్తి చెంది ఇంట్లో ఉన్న వివిధరకాల మాత్రలనుమింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన సుధాకర్‌ను గోరంట్ల ఆసుపత్రికి తీసుకెళ్లాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గార్లదిన్నె, జూన్ 17: స్థానిక శింగనమల క్రాస్ సమీపంలోని సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో సోమవారం విద్యుదాఘాతంతో ప్రకాష్‌కుమార్ (25) మరణించాడు. బీహార్‌కు చెందిన ఇతనితో పాటు సంతోష్, గోవింద్, రామ్‌జీ, నిమలేష్ రెండు నెలలు నుంచి గార్లదిన్నెలోని బ్రిక్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. సోమవారం ప్రకాష్ కుమార్ సిమెంట్ ఇటుకలకు నీరు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అతడిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రకాష్ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్టు

హిందూపురం, జూన్ 17: మండలకేంద్రమైన లేపాక్షిలో బస్టాండ్ వద్ద ఈ నెల 14న గ్రామానికి చెందిన నంజుండప్పపై దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. జనార్దన్ పాత కక్షలు మనసులో పెట్టుకొని రాయితో నంజుండప్ప ముఖం మీద గట్టిగా కొట్టాడు. దీం తో నంజుండప్ప స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న జనార్దన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

హిందూపురం, జూన్ 17: లేపాక్షి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో ఆదివారం సాయంత్రం నుంచి కనుబడ టం లేదని ఆమె తల్లి లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో సోమవా రం ఫిర్యాదు చేసింది. భార్య భర్తల గొడవే ఇందుకు కారణమని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం చేస్తాం

గ్రామస్థాయికి అధికార వికేంద్రీకరణ: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల

మడకశిర టౌన్, జూన్ 17: ఎన్నికల్లో టీడీపీ విజయానికి కష్టపడిన పార్టీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. తమ అధికారాలను గ్రామస్థాయి నాయకులకు వికేంద్రీకరిస్తూ కొత్త అధ్యయనానికి నాంది పలుకుతున్నామని పేర్కొన్నారు. వారు సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణంలో నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామస్థాయిలో అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేస్తామని, అందులో 10 నుంచి 15 మంది అవగాహన కలిగిన నాయకులు, కార్యకర్తలకు చోటు కల్పించి, తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ఎంపికలో వారు కీలక భూమిక పోషిస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, ప్రతి చిన్న ఉద్యోగానికీ డబ్బుకు ముడిపెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో అలాంటి వాటికి ఆస్కారం ఉండదన్నారు. అవినీతికి పాల్పడితే ఎవరినీ ఉపేక్షించమన్నారు. కిందిస్థాయి నాయకత్వం ఎంత బలపడితే టీడీపీ అంత బలంగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో కక్ష సాధింపులు వద్దని, అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని సైతం అవహేళన చేశారని, ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో చూడాలన్నారు. వంశీ విదేశాలకు పారిపోయారని, కొడాలి నాని, అనిల్‌కుమార్‌యాదవ్, అంబటి రాంబాబు లాంటి వారి భవిష్యత్తు ఏమిటో తేలిపోయిందన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలకు జవాబుదారీగా పనిచేసినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో అనేక అవకాశాలు పొంది పార్టీకి ద్రోహం చేసిన వారిని ఉపేక్షించమన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. చంద్రబాబు చిత్రపటానికి ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు అంకిత భావంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహరాజు, నాయకులు మనోహర్, భక్తర్, తిమ్మరాజు, ఆర్ జయకుమార్, మంజునాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అక్రమాల నిగ్గు తేలుస్తాం

మాజీ ఎంపీ నిమ్మల



మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, జూన్ 17: గత ఐదేళ్లలో మాజీ మంత్రి శంకర్ నారాయణ నియోజకవర్గంలో చేసిన అవినీతి, అక్రమాలను వెలికి తీస్తామని, వదిలే ప్రసక్తే లేదని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పేర్కొన్నారు. గోరంట్లలో శుక్రవారం తెల్లవారు జామున వైసీపీ నాయకుడు బులెట్ బాబు ఇంటిపై రాళ్ల దాడి జరిగితే... టీడీపీ, జనసేన నాయకులపై మాజీ మంత్రి నిందారోపణలు చేస్తూ, ఖబడ్దార్ అని హెచ్చరించడంపై నిమ్మల తీవ్రస్థాయిలో స్పందించారు. గోరంట్లలోని తన నివాసంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బులెట్ బాబు నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని, అతడి చర్యల వలన కడుపు మండినవారు రాయి విసిరితే పనికట్టుకుని గోరంట్లకు వచ్చి విమర్శిస్తావా అని శంకర్ నారాయణపై మండిపడ్డారు. ఇక్కడ స్థానం లభించక అనంతపురం పంపితే అక్కడ ప్రజలు నిన్ను తిరస్కరించారన్నారు. అయినా మౌనంగా ఉండక వేదాలు వల్లిస్తావా అన్నారు. బూదిలిలో దేవుడి మాన్యం భూములు ఆక్రమించాలని చూసినప్పుడే... నడిరోడ్డుపై బేడీలు వేసి నిన్ను నడిపించే రోజులు దగ్గరలోనే వస్తాయని తాను అన్నట్లు గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, శాంతి భద్రతల పరిరక్షణ, అభివృద్ధే కూటమి లక్ష్యమన్నారు. నీవు, నీకుటుంబ సభ్యులు, మద్దతు దారుల లేఅవుట్‌అక్రమాలు, భూకబ్జాలన్నీ బయటకు తీస్తామని నిమ్మల హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నిమ్మల చంద్రశేఖర్, కక్కల రఘునాథ్‌రెడ్డి, నాగరాజు, సుబ్రమణ్యం, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై అభాండాలు సహించం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, జూన్ 17: స్వార్థప్రయోజనాల కోసం మాజీ మంత్రి శంకర్‌నారాయణ పనికట్టుకుని ఎన్‌డీఏ కూటమిపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని, తాము సహించేదిలేదని టీడీపీ నాయకులు తెలిపారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే సవితకు మంత్రిపదవి లభించడంతో పార్టీ శ్రేణులు ఆమెను కలుస్తూ, ఆనందోత్సాహాల్లో ఉన్నారన్నారు. ఇలాంటి తరుణంలో బులెట్ బాబు ఇంటిపై రాళ్లు వేశారని టీడీపీ, జనసేన నాయకులపై ఆరోపణలు చేస్తూ, ప్రశాంతంగా ఉన్న గోరంట్లలో చిచ్చు రగల్చాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకునేందుకు శంకర్‌నారాయణ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే రోడ్కెక్కి తరిమికొడతామని సోమశేఖర్ హెచ్చరించారు. వైసీపీ పాలనలో చేసిన అక్రమాలను బయటకు తీస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట హిజ్రాల ఆందోళన



సీఐ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న హిజ్రాలు

మడకశిర టౌన్, జూన్ 17: కర్ణాటక రాష్ట్రం పావగడకు చెందిన హిజ్రాలు మడకశిర పట్టణంలోని మారుతీనగర్‌కు వచ్చి తమపై దాడి చేశారని పట్టణంలోని హిజ్రాలు మడకశిర పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన వారు మడకశిర ప్రాంతంలోకి రావద్దు అన్నందుకు తమపై దాడి చేశారని రూరల్ సీఐ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన వారిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. విచారించి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

టీడీపీ కార్యకర్త గడ్డివామికి నిప్పు

రాప్తాడు, జూన్ 17: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, రైతు కె భాస్కర్‌కు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అది దగ్ధమైంది. సోమ వారం తెల్లవారుజామున దాదాపు రెండు గంటల సమయంలో గడ్డివామికి నిప్పుపెట్టారు. భాస్కర్ మూడు గంటల సమయంలో గమనించగా అప్పటికే ఐదు ట్రాక్టర్ల వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లు..

మాజీ మంత్రి శంకరనారాయణపై వైసీపీ నాయకుల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

గోరంట్ల, జూన్ 17: దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాజీ మంత్రి శంకర్‌నారాయణ నీతులు మాట్లాడుతున్నారని వైసీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలో జరిగిన రాళ్లదాడి టీడీపీ, జనసేన నాయకుల పనేనంటూ మాజీ మంత్రి ఆరోపించడాన్ని వారు తిప్పికొట్టారు. గోరంట్ల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మేదర శంకర్ ఆధ్వర్యంలో సోమవారం గోరంట్లలో సమావేశం నిర్వహించారు. శంకర్‌నారాయణకు ఎంపీ సీటు కేటా యించడంతో రెండు జిల్లాలోనూ పార్టీ సర్వనాశనమైందని గంపల రమణారెడ్డి విమర్శించారు. మంత్రిగా ఉన్నప్పుడు ఆస్తులు సంపాదించుకోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలను రౌడీలుగా మార్చారన్నారు. ప్రశ్నించిన సొంత పార్టీ నాయకులపైనే 104 కేసులు పెట్టించారన్నారు. దయ్యాలు వేదాలువల్లించినట్లు బులెట్‌బాబు ఇంటిపై రాళ్లదాడిని కూటమిపై వేస్తూ నీతులు మాట్లాడుతున్నారన్నారు. గోరంట్లలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య రాజకీయ శత్రుత్వం ఎప్పుడూలేదని, ఎన్నికల స మయంలో చిన్న చిన్నసంఘటనలు సాధారణమన్నారు. ఆర్థిక లావాదేవీవల్లే రాళ్ల దాడి జరిగి ఉండవచ్చన్నారు. శంకర్ నారాయణ కుటుంబ సభ్యులు అక్రమ లేఅవుట్ల ద్వారా ఎకరాకు రూ.10లక్షలు వసూలు చేశారని మేదర్ శంకర్ ఆరోపించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాల కోసం రూ.లక్షల్లో లంచం తీసుకున్నారని, భూదందాలకు పెద్దఎత్తున పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, వీర నారాయణరెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సోమశేఖర్, గుడిపల్లి కల్యాణ్ తదితరులున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన టీడీపీ రొళ్ల నాయకులు

రొళ్ల, జూన్ 17: కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని సోమవారం టీడీపీ రొళ్ల మండల నాయకులు కలిశారు. రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప తదితరులు ఆయనను కలిసి కేంద్రంలో వక్కలిగులను ఓబీసీలో చేర్చాలని విన్నవించారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కేంద్రంలోని జేడీఎస్ కార్యాలయంలో కేంద్ర మంత్రి కుమారస్వామి సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రొళ్ల నాయకులు నవీన్‌కుమార్, మంజునాథ్, బండిరమేష్, రవికుమార్, శ్రీరంగప్ప, రంగనాథ్, దివాకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రిని శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

ఎనిమిది మంది కూలీలకు గాయాలు





ప్రమాదంలో గాయపడిన కూలీలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు

పావగడ, జూన్17: పనులకు కూలీలను తీసుకెళ్తున్న లగేజీ ఆటోను ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఎనిమిది మంది కూలీలు తీవ్ర గాయాలు పాలయ్యారు. పావగడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొమ్మతమర్రి గ్రామంలో సోమవారం ఉదయం 8గంటల సమయంలో కూలి పనులకు కూలీలు లగేజీ ఆటోలో వెళ్తున్నారు. అయితే రొద్దం నుంచి హిందూపురం వెళ్లతున్న ఎస్ఎల్ఎన్ ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలకు తీవ్రగాయాలయ్యారు. ఆటో డ్రైవర్ గిరీష్ పరిస్థితి విషమంగా మారడంతో అతడిని బెంగళూరుకు తరలించారు. గాయపడిన కూలీలను పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలించిగా అక్కడ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పావగడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ సురేష్ తెలియజేశారు.

భారత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపిక



ఆరోన్ రోనాల్డినో

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: జిల్లాకు చెందిన ఆరోన్ రోనాల్డినో భారత సాఫ్టటెన్నీస్ జట్టుకు ఎంపిక య్యాడు. ఈనెల 18 నుంచి 23 వరకు కొరియాలో నిర్వహించే నొంగ్యాప్ బ్యాంకు ఇంచియాన్ కొరియా అంతర్జాతీయ సాఫ్టటెన్నిస్ చాంపియన్‌షిప్- 2024 పోటీల్లో భారత జట్టుకు ఆరోన్ రోనాల్డినో ప్రాతినిథ్యం వహించనున్నాడు.

అడ్డదిడ్డంగా ఆసుపత్రి వద్ద బైక్‌ల పార్కింగ్

అంబులెన్స్ వెళ్లేందుకూ దారి ఉండని పరిస్థితి



ఆసుపత్రి గేటు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉంచిన ద్విచక్రవాహనాలు

హిందూపురం, జూన్ 17: రోగులు, గాయపడ్డ వారు తదితర బాధితులను అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి త్వరగా చేర్చేది అంబులెన్స్ వాహనం. దీంతో అది వెళ్లేందుకు తక్షణం దారి వదలాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. దాని ప్రయాణాని ఎవరూ అడ్డుగా ఉండకూడదు. అలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే అంబులెన్స్ సిబ్బంది కూడా ప్రమాదంలో ఉన్న వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించేందుకు సహకరించ గలదు. వారిని ప్రాణాపాయం నుంచి కాపాడగలదు. ఈ విషయాన్ని నాయకులు, అధికారులు అప్పడపుడు గుర్తు చేస్తూనే ఉంటారు. అ యితే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పరిస్థితి అందుకు అనుగుణంగా ఉండడంలేదు. అంబులెన్స్ వెళ్లేందుకు కూడా దారి వదలకుండా ఆసుపత్రిలో రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఎమర్జెన్సీ వార్డు వరకు ద్విచక్రవాహనాలు ఎక్కడ పడితే అక్క డ వదిలి వెళుతున్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా దుకాణాలు, హోటళ్లు, ల్యాబ్‌లు తదితరాలు ఉన్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ద్విచక్రవాహనాలను ఆసుపత్రి వద్ద వదిలి వెళ్తున్నారు. గేటు అడ్డంగా నిలబెడుతున్నారు. అంబులెన్స్ అత్యవసర హారన్ మోగిస్తున్నా ఎవ రూ స్పందించరు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంకా కొంత మంది అయితే నీడ ఉండటంతో అక్కడ చెట్ల కింద వాహనాలు వదిలి వెళ్లి పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని సార్లు అంబులెన్స్ డ్రైవర్లే వాహనం దిగి ద్విచక్రవాహనాలను పక్కకు తొలగించి రోగులను ఆసుపత్రిలోకి తీసుకెళ్లాల్సి వస్తోంది. మరి కొన్ని సమయాల్లో అంబులెన్స్ వెళ్లడానికి రోడ్డుపై అడ్డంగా ఉన్న ద్విచక్రవాహనాలను రోగుల బంధువులు పక్కకు తొలగించి ఆసుపత్రికి చేరుతున్నారు. అంతేగాకుండా ద్విచక్రవాహనాలు రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా నిలుపడంతో వివిధ కారణాలతో ఆసుపత్రికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆసుపత్రి వర్గాలు, పోలీసులు పరస్పర సహకారంతో... రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనాలను నిలుపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

భక్తిశ్రద్ధలతో ఈద్గాలలో ముస్లింల ప్రార్థనలు



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం , జూన్ 17: త్యాగనిరతికి, దాన గుణానికి ప్రతీక బక్రీద్ పండుగ జామియా మసీదు మౌలానా అబ్దుల్ మన్నాన్, ముతు వల్లి నూరుల్లా ఖాన్, కోశాధికారి సిరాజ్ పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని సోమవారం పట్టణ పరిధిలోని అల్‌హిలాల్ పాఠశాల ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాం క్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మౌలానా బక్రీద్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల్లో టీడీపీ నాయకులు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పెనుకొండ రూరల్: బక్రీద్ పండుగను పెనుకొండ మండలంలోని గుట్టూరు, నాగలూరు, తిమ్మాపురం, శెట్టిపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో జురుపుకున్నారు. ఉదయం ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు.



సోమందేపల్లిలో ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు

పెనుకొండ టౌన్: బక్రీద్ పండుగను పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో పెద్ద ఎత్తున జరుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



గోరంట్లలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గోరంట్ల: మండలకేంద్రంలో ముస్లింలు ప్రార్థన మందిరాల నుంచి గోరంట్ల ప్రధాన రహదారిపై ర్యాలీగా ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుడికి కుర్బానీ ఇచ్చి, స్నేహితులతో కలిసి విందు భోజనాలు చేశారు.



మడకశిరలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



మడకశిరలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిరటౌన్/ అగళి: బక్రీద్ వేడుకలను మడకశిర వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలో ఉదయం ర్యాలీగా ఈద్గా మైదానానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లోనూ ప్రార్థనలు చేశారు. అలాగే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్.అండ్‌బీ అతిథి గృహంలో కేక్‌కట్‌చేసి ముస్లిం లకు స్వీట్లను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి తదతరులు పాల్గొన్నారు. అలాగే అగళి మండలకేంద్రంలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



అగళిలో ఈద్గా వద్దకు తరలి వెళ్తున్న ముస్లింలు



పావగడలో ఈద్గామైదానానికి ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

పావగడ: బక్రీద్ వేడుకలను తాలుకా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పావగడలోని రొప్పం నుంచి ర్యాలీగా ఈద్గా మైదానం చేరుకుని సాముహిక పార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే వైఎన్ హొసకోటలోని ఈద్గామైదానంలో బక్రీద్ వేడుకలను నిర్వహించారు.

మహిళపై భర్త, అత్త దాడి



పిల్లలతో బాధితురాలు లక్ష్మి

గుంతకల్లుటౌన్, జూన్17: పట్టణంలోని పాతగుంతకల్లులో నివాసముంటున్న తనపై భర్త బ్రహ్మయ్య, అత్త పార్వతి, బంధువులు సోమవారం దాడి చేశారని బాధితురాలు లక్ష్మి తెలిపింది. తనకు ఆర్ఎంపీ బ్రహ్మయ్యతో 2008లో వివాహం అయ్యిందన్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానమన్నారు. వివాహం అయినప్పటి నుంచి భర్తతో గొడవలు జరుగుతున్నాయన్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయన్నారు. ఐదేళ్ల నుంచి తన పిల్లలతో పాతగుంతకల్లులో వేరుగా నివాసముంటున్నట్లు ఆమె తెలిపారు. తమ విడాకుల కేసు కోర్టులో నడుస్తోందన్నారు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం తన భర్త బ్రహ్మయ్య, అత్త పార్వతి, వారి బంధువులు రామాంజనేయులు, మోహన్, రంగమ్మలు రోకలిబండ, కారం తీసుకుని ఇంటి మీద దాడికి వచ్చారన్నారు. ఇంట్లోకి చొరబడి తనను, తన కుమార్తెను కొట్టారని తెలిపారు. 100 కాల్ చేయడంతో టూటౌన్ పోలీసులు సకాలంలో రావడంతో తన ప్రాణాలు నిలిచాయన్నారు. దాడి చేసిన వారిని టూటౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడి ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ గణేష్ తెలిపారు.